

# గుండెల్లో మంట

పాలడుగు వెంకటేశ్వర రావు

సీతారత్నానికి తల గిర్రున తిరిగినట్లయింది! ఓటమి, ఒంటరితనం, అవమానం, ఉక్రోషం, ఆవేశం, చేతకానితనం – అన్నీ కలిసి సీతారత్నాన్ని అజ్జరిగేక చాలాసేపు పిచ్చిదాన్నిగా చేశాయ్!

అనదల్చుకున్న నాలుగుమాటలూ చల్లగా అనేసి, తర్వాత మెల్లగా లేచి చక్కాపోయిందా ముసలావిడ. అంతసేపూ సీతారత్నానికి నోరు నొక్కేసినట్లయింది. కాసేపటికి తేరుకుని చూసేసరికి ఎదురింటి సౌభాగ్యమ్మకూడా ఎదుట లేదు. ఒంటరిగా మిగిలిపోయిన సీతారత్నానికి, ఇదంతా ఇట్లాఎందుకు జరిగిందో అర్థంకాలేదు.

ఆనాటికీ ఈనాటికి సరిగా రెణ్నెల్లే

తేడా అంతే. బెజవాడనుంచి సూర్యారావు వొచ్చివెళ్ళి అప్పటికి రెండు రోజులే అయింది.

అప్పుడు ముసలాయనా, జగన్నాధమూ ఇంట్లో లేరు. సాయంత్రానికి గాని ఇంటికి తిరిగిరాలేదు వాళ్లు. జగన్నాధం సీతారత్నం మొగుడు. ముసలాయన అతనితండ్రి సూర్యారావు సీతారత్నానికి ఆడబిడ్డ మొగుడు.

ఆ ఉదయం భోజనంచేస్తూ వున్నప్పుడు యదాలాపంగా అడిగింది సీతారత్నం సూర్యారావుని. "ఏం లేదు. చూసిపోదామని వచ్చాను" అన్నాడు సూర్యారావు, జవాబుగా. అప్పటికీ సీతారత్నానికి అనుమానంగానే వుంది.

సూర్యారావు ఆమర్నాడు పేటకి వెళ్ళి, తిరిగి మూడోనాడు వచ్చాడు. ముసలాయనతో గుసగుసగా ఏదో మాట్లాడి నాలుగోనాడు తెల్లవారుఝామున బెజవాడ వెళ్ళిపోయాడు, సూర్యారావు.

ఎంతప్రయత్నంచేసినా సీతారత్నానికి ఏసంగతీ తెలీలేదు. ఆవిడ గుండెలో చిన్నమంట బయల్దేరినట్టయింది.

* * *

నిజం నిప్పులాటిది !

ఎల్లకాలమూ దాన్ని దాద్దామని ఎంత ప్రయత్నించినా వీలయే పని కాదు.

సూర్యారావు వచ్చి వెళ్ళిపోయిన నాలుగోనాడు సీతారత్నం కాలక్షేపం కోసం 'సీతయ్య'గారింటికి వెళ్ళింది. సీతయ్యపెళ్ళాం అంది.

అప్పుడుగాని తెలీలేదాసంగతి !

అవును. సీతయ్యపెళ్ళామే మాట వరసకి అంది. "ఇదటాసంగతీ. నాకు చెప్పకుండా దాస్తున్నావా ?" అని నిష్ఠూరమాడింది, సీతారత్నాన్ని.

"మొన్న పేటకి మావాళ్ళింటికి వెళ్ళేను. అప్పుడుగాని నాకూ తెలీలేదు. నువ్వూ మారిపోయావు సీతారత్నమూ" అని నిలవతీసింది.

సీతారత్నం తెల్లపోయింది !

ఆవెంటనే వువ్వెత్తున కోపం పొంగి వచ్చింది సీతారత్నానికి. "నిజంగా నాకూ తెలీదొదినా" అన్చెప్పి, సీతయ్యగారింటి దగ్గర్నుంచి బుసలు కొడుతూ తిరిగివచ్చింది సీతారత్నం.

కోపం, ఉక్రోషం, ఆవేశం, అవమానం - అన్నీకలిసి సీతారత్నాన్ని ఆరోజంతా చాలా పీడించాయి.


* * *

ముసలాయన వూళ్లోలేదు.

కూతుర్దగ్గరకని బెజవాడ వెళ్లాడు- నాల్రోజులక్రితం

గూడుపుఠానీ జరుగుతూందన్న మాట !

"ఏమిటే ! సంగతేమిటి ?" అని విసుక్కున్నాడు జగన్నాధం, తనమీద విరుచుకుపడిన సీతారత్నంతో.




జగన్నాథానికి ఆ 'సంగజ్జెప్పి'. "ఇదీ వ్యవహారం వాళ్ళకి మనం శత్రువులమయిపోయినాం. ఈనాటికి కాని వాళ్ళ మయాము.'' అని చదువులు చదివింది సీతారత్నం.

జగన్నాథం "అట్లాగా!" అని తెల్లబోయాడు మొదట.

"పోనీ నేను పరాయిదాన్ని, కాని దాన్ని. శత్రువుని. చెడగొట్టేదాన్ని. నాకుచెప్పరు... కాని మీరేమయారు? తోడబుట్టినవాడ నయినా లేదా? ఏమిటీ మోసాలు? అసలు మీకు లేక పొయ్యాక ఎవర్నని ఏంలాభం? వాళ్ళు ఎంత కాదని తోసేసినా, కావాలని పూసుకు తిరుగుతారు మీరు. ఆ ముసలాయనా వాళ్ళ తరుపే.'' అంటూ ఇన్ని చదువులు చదివింది సీతారత్నం.

ఆ వెంటనే నాలిక్కొరుక్కున్న జగన్నాథం "అవునే! ఆమధ్య వొకసారి నాకూ చెప్పినట్టే జ్ఞాపకం. నేనే మర్చిపోయాను." అని తొట్రుపడ్డాడు.

''వాళ్ళు అసలు మీకు చెప్పాలేదు. పెట్టాలేదు. నన్ను మధ్యపెట్టాలని మీ ప్రయత్నం. ఇంతజరిగినా మీకు రోషం లేదు. చూస్తాను ఎట్లాచేస్తారో? ఏమిటనుకున్నారో? కుట్రలుచేసి, తెలియకుండా దాచీ, ఇవతలి మనుషుల్ని ఏమనుకున్నారు? చెడగొట్టటం తప్ప ఇవతలివాళ్ళకి పన్లేదనా వాళ్ళ

వుద్దేశం ? తమబుద్ధులే అందరికీ వుంటాయని కాబోలు..." ఆ రోజు అంతా గొణుగుతూనే వుంది సీతారత్నం.

జగన్నాథం మళ్ళీ మాట్లాడలేదు.

జగన్నాథానికి సరిగా అబద్ధ మాడటం కూడా చాతకాదని తేలిపోయింది.

* * *

ఆ మూడోనాడు సీతయ్య పెళ్ళాం కబురంపింది. అందాకా సీతారత్నం గుండెలు మండుతూనే వున్నయ్.

ఆ సమయానికి సౌభాగ్యమ్మ అక్కడేవుంది.

అప్పుడే అయింది ఆ ముసలమ్మతో పరిచయం. సీతయ్య పెళ్ళాంకి ఆవిడ మేనత్త అవుతుందట! నగలు చేయించటానికి గుంటూరు వెళ్తూ వచ్చిందట, తననికూడా తీసికెళ్దామని 'అన్చెప్పి, "ఈవిడేనమ్మా పెళ్ళికొడుకుతల్లి.'' అని పరిచయం చెసిందిసీతయ్య పెళ్లాం.

కాసేపు అపామాపీ కబుర్లయాక "పెళ్ళి నిశ్చయమయిందా ?" అనడిగింది సీతారత్నం.

"ఇంకా కాలేదమ్మా. ప్రస్తుతం మాటలు జరుగుతున్నాయి. ఏమయినా, మావాడికి ఈఏడే పెళ్ళి చేస్తాం. ఈలోగా బంగారం కొందామని బయల్దేరాను; మళ్ళీ ధర పెరగొచ్చునని. పెళ్ళి నిశ్చయమయినాకే నగలసంగతి."

"కట్నం అదీ..."

"ఆ సంగతే నలుగుతూ వుంది. అన్నట్టు నీకుమాత్రం తెలివకుండా వుంటుందా? మీ మామగారేగా అటూ ఇటూ తిరుగుతున్నారు." నవ్విందామె.


"అహా. పిల్లని చూశారా మీరు?" మాట తప్పించింది సీతారత్నం.

"నేను చూళ్ళేదుగాని మావాళ్ళు వెళ్ళివచ్చారు. ఏమన్నా...? అట్లాగంటున్నావ్ ?''

"ఏం లేదులెండి. మిమ్మల్ని చూస్తుంటే ఆభిజాత్యం, ఐశ్వర్యం బాగా వున్న వారిలావుంది. మరి, ఏం చూసి మీవాళ్లు ఆ పిల్లని ఇష్టపడ్డారో నాకు అర్ధమవటం లేదు!'' సీతారత్నం ఆగింది.

"ఇదేమిటి తల్లీ ?'' ఆవిడ ఆశ్చర్యపోయింది !

"అవునండీ. అమ్మాయి నా మేనగోడలే అవుగాక. కాని ఉన్నమాట చెప్పక తప్పదు ఉండేదేదో మొహాం మీదే అనే స్వభావం నాది వాళ్లు కట్నం కూడా అంత ఇవ్వలేరు. వొకవేళ ముసలాయన ఇస్తాడనుకుంటారేమో? మా వారు వొప్పుకోరు. పిల్ల కూడా అంత అందంగా ఉండదు. చురుకుదనం లేదు. మందమతి. ఏ పనీ చాతకాదు. తల దువ్వుకోవటం కూడా రాదంటే నమ్మండి. మరి మీరు ఏం జూసి అటు మొగ్గుతున్నారో గాని,




మొత్తానికి మిమ్మల్ని మాయలో పడేశారు వాళ్ళు..."

నిజంగా కడుపులో ఉన్నదంతా కక్కేసింది సీతారత్నం అబద్ధాలూ, నిజాలూ కలబోసి. తర్వాత బస్సు రాగానే సీతయ్య పెళ్ళాన్ని తీసుకుని ఆవిడ గుంటూరు రెళ్ళింది.

* * *

అజ్జరిగి నెల్లోజులైనా కాలేదు ఎవరిద్వారానో తెలిసింది; పెళ్ళి కుదిరిందని.

అగ్గిమీద గుగ్గిలం పడినట్టయింది సీతారత్నం పరిస్థితి.

ఆడబిడ్డని నానా శాపనార్థాలూ పెట్టింది. ముసలాయన్ని నాలుగు మాటలూ దులిపేసింది. అవతలి వాళ్ళనీ ఆడిపోసింది.

"నిజమే. నీకెందుకు చెప్పాలి? నా కూతుర్ని పదేళ్ళుగా పుట్టింటి గడప తొక్కకుండాచేసి పుణ్యం కట్టుకున్నావుగా? అయినా నీకు చెపితే చెడగొట్టవన్న నమ్మకం ఏమిటి? అసలు అసంగతి నీకెందుకు?" నాలుగూ దులిపాడు ముసలాయన. కలిసి ఉంటూనే కలివిడి లేనితనం!

జగన్నాథం మాట్లాడలేదు. అంతా వింటూ కూడా. వినివిని అతను ఫోంచేసి, పొలం వెళ్ళిపోయాడు. అంతకుముందు బైటికి తీసికెళ్ళి, ముసలాయన బెజవాడ వెళ్ళేముందు కొడు

కుతో కాసేపు మాట్లాడేడు, గుసగుసగా. ఇన్నాళ్లూ ఆ ఇంట్లో తన మాటే 'సుగ్రీవాజ్ఞ' అనుకున్న సీతారత్నానికి కన్నీళ్ళు వచ్చేయి. నోరు పెగల్లే దరుద్దామంటే. సీతారత్నం పెళ్ళయి కాపరానికి వచ్చాక ఇట్లాంటి పరిస్థితి ఎదురవలే దెప్పుడూ. సీతయ్య పెళ్ళాం పేట వెళ్లింది నాల్రోజుల క్రితమే. ఎదురింటి సౌభాగ్యంగారింటికి వెళ్లింది సీతారత్నం.

"ఏం వొదినా? ఇంకా ఇక్కడే ఉన్నావా? మీ ఆడబిడ్డ కూతురు పెళ్ళి నిశ్చయమయిందటగా?"

"ఏం పెళ్ళోళ్ళే. మన కెందుకు? మననేం పిల్చారా బొట్టుపెట్టి? అయినా మా ఆడబిడ్డకి బుద్దెందుకు లేకపోయిందీ అంట?"

"అదేం వదినా?" ఆశ్చర్యపడింది సౌభాగ్యమ్మ.

"మొన్న మా వారు పేటకి వెళ్ళినప్పుడు తెలిసిందట! ఆ పెళ్ళికొడుకు మంచివాడు కాడట! అప్పుడప్పుడు పిచ్చిపట్టి దేశాలుపట్టి పోతాడట! అయినా మన కెందుకులే. ఏదో గంతకు తగ్గ బొంత. ఎవరికి తగ్గ సంబంధం వాళ్ళకి దొరుకుతుంది మరి! ఎల్లికిపుల్లిగాడు!..."

"అట్లాగా...!!!"

"మరేం టనుకున్నావు? ఆ పెళ్ళికొడుకు తల్లి న్నువ్వ్వా చూశావుగా అనాడు. ఆవిడ అందుకే అంత తొందర పడ్తూంది! అక్కడికీ మా వారు మా ఆడబిడ్డకి చెప్పారట! కాని...'వినాశకాలే విపరీతబుద్ధి' అని, మంచిమాట వింటూరా? పోనీవమ్మా వదినా! ఎవరి కర్మ కెవరు బాధ్యులు..."నవ్వింది సీతారత్నం, అక్కసుగా. సౌభాగ్యమ్మ తెల్ల మొహం వేసింది! మర్నాడే వూరంతా గుసగుసలు!

ఆ సౌభాగ్యమ్మకి బుద్ధిలేక అంత పనీ చేస్తుందని సీతారత్నం ఆనాడనుకుని ఉంటే ఇంత గొడవ జరిగుండకపోను ఈ నాడసలు! నిజం!

అవు నెంత పని జరిగింది! ఆడదాన్నోట్లో నువ్వగింజ దాగద నూరికే అన్నారా? ఉదయమే బస్సుకి పేట నుంచి సీతయ్య పెళ్ళాం దిగిందని తెలిసింది సీతారత్నానికి సీతారత్నం ఆ వయిపు తొంగన్నా చూడలేదు. మనసులో గుబులే!

మధ్యాహ్నం వొంటిగంటా ఆ సమయంలో...పడుకుని వుంది సీతారత్నం. వారమైంది. పెళ్ళిపన్లుకని ముసలాయన ఈసారి జగన్నాథాన్ని కూడా తీసుకుపోయాడు. పదేళ్ళ తర్వాత తిరిగి ఆ గడపతొక్కిన ఆడబిడ్డ, పెళ్లికి రమ్మని సీతారత్నాన్ని బ్రతిమాలింది. కాని ఒంట్లో బాగుండక పోవటంవలన సీతారత్నం వెళ్ళలేక

పోయింది. ఇంకా బ్రతిమాలలేదని దుఃఖం!!

ఆ సమయంలో దిగారు సీతయ్య పెళ్ళాం, ఆ ముసలావిడా. వాళ్ళ వెనకాలే సౌభాగ్యమ్మ...కట్టకట్టుకుని వచ్చారు!! ముగ్గురూ.

"రండి రండి. కూర్చోండి." ఓపిక తెచ్చుకుని లేచి ఆహ్వానించి చాప పరిచింది సీతారత్నం.

"ఫర్వాలేదమ్మా! బస్సు టయిమయింది. అన్నట్టు నీకూ తెలుసుగా! పెళ్లి నిశ్చయమయిందమ్మా! రేపు పద్దాలుగో తారీకునే! కోడలికి నగలు చేయించాలి. బట్టలు, ముప్ఫయికాసుల వడ్డాణము, మిగతా నగలూ అన్నీ కలిపి పదివేలుదాకా అవుతుంది. నువ్వు కూడా వస్తావా? మేనగోడలుకోసం మేనత్తచేత ఎంపిక చేయిద్దామనుంది" అంది ఆవిడ.

తన అనారోగ్యాన్ని గురించి పది నిముషాలు చెప్పుకుంది సీతారత్నం రుద్ధకంఠంతో.

ఓపిగ్గా అంతా విని, వెళ్తూ వెళ్తూ ఆవిడ అంది. "చూశావా అమ్మా! వీడు నా కడగొట్టు బిడ్డ. ముచ్చటగా శుభమాలని పెళ్లి తలపెట్టుకున్నాము. ఈ వూళ్ళో కొంతమంది నా బిడ్డకి పిచ్చి అని పుకారు పుట్టించారట! నా కొడుకేం? బంగారుకొండ. దొరబాబు. వాడిని అన్నవాళ్ళే పిచ్చివాళ్లు. అయినా వాళ్ళకేం పని? అసలు ఆ అవసరం ఏమి వచ్చింది? కొంతమందికి కుక్కబుద్ధు లుంటాయమ్మా! అట్లాంటి వాళ్ళనిదూరంగా ఉంచటమే మంచిది. మొన్న నేనే స్వయంగా వెళ్లి కోడల్ని చూసుకున్నాను. నాకూ నచ్చిందనుకో...! బస్సు టయిమయింది. వెళ్తాము. అన్నట్టు పెళ్లినాటికన్నా నీ ఆరోగ్యం కుదుటపడాలి. నువ్వు తప్పక వస్తావుగా - స్వయానా మేనగోడలాయె!"

సీతారత్నానికి తల గిర్రున తిరిగింది. గుండెల్లో దిగా యా మాటలు సూటిగా.

నోరు పెగల్లేదు. గుడ్లు తేలవేసి సౌభాగ్యమ్మవంక చూసింది పిచ్చిగా. అవమానం, ఉక్రోశం, ఆవేశం, చేతకానితనం అన్నీ కలిసి సీతారత్నాన్ని పిచ్చిదాన్ని చేశాయి. అప్రయత్నంగా కళ్ళవెంట నీళ్లు తిరిగాయి.

అంతా వెళ్లిపోయినారు.

ఒంటరిగా మిగిలిపోయిన సీతారత్నానికి ఇదంతా ఇట్లా ఎందుకు జరిగిందో అర్థం కాలేదు. ఆవిడ గుండెల్లో మంట ఎంతటికీ చల్లారలేదు.